# సారూ.. సర్వీసురోడ్డు ఏమైంది?

- పూర్తిస్థాయి సర్వీసురోడ్డు లేక జరుగుతున్న ప్రమాదాలు
- రాంగ్‌రూట్ పేరుతో చలాన్లు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని రాజీవ్ రహదారికి పూర్తిస్థాయి సర్వీసు రోడ్డు లేదు. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు సైతం కోల్పోవడంతో పాటు పలువురు గాయాల పాలై మంచాలకే పరిమితమవుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ గేట్ ఎదురుగా గల కృష్ణ పెట్రోల్ బంక్ నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు సర్వీసు రోడ్డు లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల వాహనదారులు రోడ్డు క్రాస్ చేస్తుంటే రాంగ్ రూట్‌లో వాహనం వెళ్తోందని ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధిస్తున్నారు. దీంతో వాహనదారులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సర్వీసు రోడ్డు లేదు కదా ఎందుకు చలాన్ వేస్తున్నారని ఎవరైనా అడిగితే తమ డ్యూటీ తాము చేస్తున్నామని సమాధానం చెప్తున్నారని వాహనదారులు వాపోయారు.



రాంగ్ రూట్ పేరుతో చలాన్ విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**ప్రమాదాలకు కేరాఫ్‌గా ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్..**

ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా పని చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. జన సంచారం ఉన్న సమయంలో కొంత సేపు ట్రాఫిక్ సిగ్నల్స్ ఆన్ చేసి ఆ తర్వాత బంద్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## పాలకులు బాధ్యత తీసుకోవాలి



రహదారికి పూర్తిస్థాయిలో సర్వీసు రోడ్డు లేకపోవడంతో కొంతమంది అత్యవసరంగా మెయిన్ రోడ్ పక్కగా వాహనాలతో వస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఫొటో తీసి చలాన్లు వేస్తున్నారు. రోడ్డు నిర్మించే బాధ్యత పాలకులు తీసుకోవాలి. కూలీ పనులకు వెళ్లేవారు చిన్న వాహనాలపై వస్తున్నప్పుడు కూడా చలాన్లు వేస్తున్నారు. వారు ఎలా చెల్లిస్తారు.

– చిలుక శంకర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు

## ట్రాఫిక్ పోలీసులు ఆలోచించండి



సర్వీసు రోడ్డు లేకపోవడంతో పాటు కృష్ణానగర్‌లో నివసిస్తున్న వారు తప్పనిసరిగా రోడ్డుకు రావాల్సి వస్తుంది. పాల ప్యాకెట్ కోసం వచ్చినా వాహనాలకు చలాన్లు వేస్తున్నారు. ట్రాఫిక్ అధికారులు, పాలకులు ప్రజల పక్షాన ఆలోచించి త్వరగా సర్వీసు రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– జానకిరాం, మాజీ ఉద్యోగి, ఎన్టీపీసీ రామగుండం

## క్లుప్తంగా

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఇంటర్ జిల్లా నోడల్ అధికారి కల్పన

**సుల్తానాబాద్:** విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి కల్పన అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సురేశ్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

### ప్రజల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

**కమాన్‌పూర్:** మండలంలోని నాగారం, పేంచికల్‌పేట గ్రామాలను మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. గ్రామాల్లోని సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీశ్, నాయకులు మచ్చగిరి రాము, మట్ట శంకర్, దండె లక్ష్మీనారాయణ, మల్లారపు అరుణ్‌కుమార్, పంతకాని విశ్వతేజ, పెద్దపల్లి శ్యాం, పిల్లి చంద్రయ్య, మెరె ప్రశాంత్, కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ప్రైవేట్ టీచర్‌కు సత్కారం



సత్కరిస్తున్న కలెక్టర్, డీఈవో తదితరులు

**పెద్దపల్లిరూరల్:** పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన ఉపాధ్యాయురాలు అల్లెంకి రజనీదేవిని కలెక్టర్ శ్రీహర్ష సత్కరించారు. పెద్దపల్లిలో కొన్నేళ్లుగా అందిస్తున్న ఉపాధ్యాయ సేవలకు గుర్తింపుగా ఈ సత్కారం దక్కడంపై డీఈవో మాధవి, శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న ఎంఈవో కొమురయ్య

**రామగిరి:** మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో మండల విద్యాధికారి కొమురయ్య సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తెలుగు భాషా దినోత్సవం



పూలమాల వేస్తున్న ఎంఈవో లక్ష్మీ

**మంథని:** ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా మంథని మండలం గుంజపడుగు పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాసరి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

**రామగిరి:** సైబర్ నేరాల నియంత్రణపై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్వచర్లలో మంగళవారం సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాట్సాప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఎవరైనా తల్లిదండ్రులు ఇస్తే వాహనాలు సీజ్ చేసి, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు.

### ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక

**ఎలిగేడు:** ఫొటో, వీడియోగ్రాఫర్ల మండల వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను మంగళవారం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ముంజంపల్లి శ్రావణ్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్, కోశాధికారిగా కొంక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ముంజంపల్లి మహేందర్, గౌరవ అధ్యక్షుడిగా కోరుకంటి వెంకటేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. అనంతరం 30ఏళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు.

## కాళోజీ ఆశయ సాధనకు కృషిచేయాలి



పెద్దపల్లిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో..



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న కమిషనర్ అరుణశ్రీ



సుల్తానాబాద్: ఎంపీడీవో కార్యాలయంలో..



రామగుండం: అంతర్గాం తహసీల్ ఆఫీసులో..

**పెద్దపల్లిరూరల్/గోదావరిఖనిటౌన్/సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్/రామగుండం/కమాన్‌పూర్/ముత్తారం/కోల్‌సిటీ/కాల్వశ్రీరాంపూర్/జూలపల్లి:** కాళోజీ నారాయణరావు ఆశయ సాధనకోసం ప్రతీ పౌరుడు పని చేయాలని పలువురు పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

## సంక్షిప్త వార్తలు

**• కంప్యూటర్ శిక్షణకు ఆహ్వానం**

**ఎలిగేడు:** మండల కేంద్రంలో నానేస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కట్ల సత్యనారాయణ తెలిపారు. ఈ కంప్యూటర్ శిక్షణలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్(డీసీఏ)లో నైపుణ్యాలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. కోర్స్ ఫీజు రూ.వెయ్యి ఉంటుందని, ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 45రోజుల శిక్షణ ఉంటుందని వివరించారు. వివరాలకు 96766 34929, 92469 34929 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

**• మరమ్మతు పనులకు రూ.10.60కోట్లు**

**మంథని:** నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, పాలకుర్తి, ముత్తారం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతు పనులకు రూ.10కోట్ల 60లక్షలు మంజూరైనట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు మండలాల్లో 79 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి అభివృద్ధి పనులకు రూ.9కోట్ల 64లక్షలు, 48 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు పనులకు రూ.96 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

**• పరామర్శ**

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బండారి రామ్మూర్తి తండ్రి రామస్వామి అనారోగ్యంతో మరణించారు. కాగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

**• సింగరేణి కార్మికుడికి పరామర్శ**

**యైటింక్లయిన్‌కాలనీ:** ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 వర్క్‌షాప్‌లో విధులు నిర్వహిస్తూ యైటింక్లయిన్ కాలనీలో నివాసం ఉంటున్న సింగరేణి కార్మికుడు దాసరి మల్లేశ్ ఇటీవల పనిస్థలంలో జరిగిన గని ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, టీబీజీకేఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి మంగళవారం కాలనీలోని మల్లేశ్ ఇంటి వద్ద కలిసి పరామర్శించారు.

**• మంథని పోలీసులపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు**

**మంథని:** తనపై తప్పుడు క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఇప్పటికీ అక్రమంగా ఫోన్ ట్యాపింగ్, నిఘా, వేధింపులు, రాజకీయ ప్రభావంతో మంథని సర్కిల్ పోలీసులు, ప్రైవేటు వ్యక్తులు మానవ హక్కులు ఉల్లంఘిస్తున్నారని మంథనికి చెందిన హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీశ్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర డీజీపీ, రామగుండం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం దారుణమన్నారు.

**• రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక**

**జ్యోతినగర్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యార్థులకు మాత్రమే సంబంధించిన కళాఉత్సవ్ ప్రోగ్రాంలో స్థానిక విశ్వభారతి విద్యాలయానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సోలో క్లాసికల్ డ్యాన్స్ విభాగం నుంచి బి.నక్షత్ర (9వ తరగతి), సోలో ఇన్‌స్ట్రుమెంట్ విభాగం నుంచి వి.జస్టిస్‌రాజు (9వ తరగతి) విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. వీరిని మండల విద్యాధికారి జింక మల్లేశం, విశ్వభారతి హెచ్‌ఎం బందారపు తిరుపతిగౌడ్ అభినందించారు.

**• మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన**

**మంథని:** మెప్మాలో తనను అక్రమంగా తొలగించారని పూసాల రజిత మహిళలతో కలిసి మంగళవారం మంథని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ మద్దతుగా బైఠాయించారు. మంథని మెప్మాలో రజిత ఐదేళ్లుగా టీఎల్‌ఎఫ్ ఆర్పీగా పనిచేస్తున్నారని, ఎలాంటి సమాచారం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. ఆమె స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వడం సరికాదన్నారు.

**• చట్టాలపై అవగాహన**

**ఫెర్టిలైజర్‌సిటీ:** రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనియన్ సోషల్ వర్కర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

**• ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్‌లో..**

**ఎలిగేడు:** మండలంలోని ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా సాధికారత అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ, చైల్డ్ కౌన్సిలర్ వెంకటస్వామి మాట్లాడారు. హక్కులు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

**• సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి**

**కాల్వశ్రీరాంపూర్:** సీజనల్ వ్యాధులపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వార్డెన్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం సరోజన పాల్గొన్నారు.

**• 14న సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం**

**గోదావరిఖని:** ఆర్జీవన్ ఏరియా ఆసుపత్రిలో ఈనెల 14న సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేర్ హాస్పిటల్ హైదరాబాద్ నుంచి కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాలకి సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్లు క్యాంపునకు రానున్నారన్నారు. ఆర్జీ–1, 2, 3, ఏపీఏలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు, సీపీఆర్‌ఎంఎస్ కార్డు కలిగిన రిటైర్డ్ ఉద్యోగులు వారి భార్య లేక భర్త తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా నమోదు చేసుకున్న వారికే చికిత్స చేయించుకునే అవకాశం ఉందన్నారు.

## బొగ్గుగనుల పరిరక్షణకు బీఎంఎస్ పోరాటం



మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

**యైటింక్లయిన్‌కాలనీ:** సింగరేణి సంస్థను, బొగ్గుగనుల పరిరక్షణ కోసం బీఎంఎస్ సంఘం నిరంతరం పోరాటాలు చేస్తుందని బీఎంఎస్ జనరల్ సెక్రటరీ సారంగపాణి అన్నారు. యైటింక్లయిన్ కాలనీ ప్రెస్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యలు, వారి హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం చేస్తూ, కార్మికుల వైద్య సంక్షేమం, పరిశ్రమ ప్రగతికి ముందుంటున్న సంఘం బీఎంఎస్ మాత్రమేనన్నారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో 12న ఆర్జీ–2 ఏరియా జీఎం కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాలో అన్నివర్గాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆర్జీ–2 బీఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కుమారస్వామి, కార్యదర్శి శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

## 19న గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

**రామగిరి:** ఏపీఏ ఏరియాలో వివిధ కారణాలతో గైర్హాజరైన ఉద్యోగులకు ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు తెలిపారు. అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని అడ్రియాల లాంగ్ వాల్ గనిలో విధులు నిర్వహిస్తూ 2025లో జనవరి నుంచి ఆగస్టు వరకు 80 మస్టర్ల కంటే తక్కువ హాజరు నమోదు చేసిన ఉద్యోగులకు సెంటినరీకాలనీలోని సిఎస్‌సిఓఏ క్లబ్ నందు 19న ఉదయం 9గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కావున సదరు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో గైర్హాజరుకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట తీసుకొని, ఈ కౌన్సెలింగ్‌కు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

**ఆర్జీ–1లో వృత్తి విద్య పరీక్ష**

**గోదావరిఖని:** సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో గతేడాది నిర్వహించిన టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్ కోర్సులు నేర్చుకున్న మహిళలకు 11న ఉదయం 10గంటలకు స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్జీ–1 అధికార ప్రతినిధి రవీందర్‌రెడ్డి తెలిపారు. భారత్‌ఖాదీ గ్రామోద్యోగ మహా విద్యాలయ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు శిక్షణ పొందిన సమయంలో తాము తయారు చేసిన హ్యాండ్ క్రాఫ్ట్స్, రికార్డులను వెంట తీసుకురావాలన్నారు. పరీక్ష అనంతరం ధృవీకరణ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు చెప్పారు.

**గుర్తింపు సంఘం ఎన్నికలకు నామినేషన్ దాఖలు**

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా హెచ్‌ఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ డెమోక్రటిక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మేకల రామస్వామి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రాజెక్టు పరిపాలన భవన ఎన్నికల అధికారి హెచ్ఆర్ ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్ ఉన్నారు.

## ‘సీఐపై చర్య తీసుకోవాల్సిందే’



వినతిపత్రం అందిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

**గోదావరిఖని:** సింగరేణి కార్మికునిపై అకారణంగా చేయిచేసుకున్న చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్‌పై చర్య తీసుకోవాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కోరారు. ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా గోదావరి వంతెనపై విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగి గండు శ్రావణ్‌పై సీఐ అకారణంగా చేయిచేసుకున్నాడన్నారు. టీబీజీకేఎస్ సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపెల్లి రవి, ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, నాయకులు జావిద్‌పాషా, మోదుంపెల్లి రాజేశం, ప్రవీణ్, ఇందూరు సత్యనారాయణ, చెలుకలపల్లి శ్రీనివాస్, దూట శేషగిరి, ప్రదీప్, మీస రాజు, భాస్కర్, దిడ్డి లక్ష్మణ్, వాసర్ల జోసెఫ్ పాల్గొన్నారు.



జూలపల్లి: మండల కేంద్రంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ రోడ్డు వెంట వెళ్లేవారి వెంటపడి దాడి చేస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. 20రోజుల క్రితం బస్టాండ్ ఏరియాలో ఒకేరోజు పదిమందిని కరిచాయి. గ్రామంలో ఒంటరిగా నడవాలంటే స్థానికులు జంకుతున్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

## వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాలివ్వాలి



నిరసన తెలుపుతున్న మారుపేర్ల బాధితులు

**గోదావరిఖని:** మారుపేర్ల వారసులకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పించాలని కోరుతూ మంగళవారం స్థానిక భాస్కర్‌రావుభవన్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులతో స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి భాస్కర్‌రావు భవన్ వద్ద ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. మెడికల్ అన్‌ఫిట్ అయి ఏడేళ్ల నుంచి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. విజిలెన్స్ ఎంక్వయిరీ పేరుతో చాలామంది కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఈనెల 12న జరిగే స్ట్రక్చర్ సమావేశంలో సమస్య పరిష్కరించాలని కోరుతూ భాస్కర్‌రావు భవన్‌లో ఉన్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్యను వేడుకున్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్య అడ్వకేట్ జనరల్ వద్ద ఉందని, అడ్వకేట్ జనరల్ నిర్ణయం రావాలంటే ప్రభుత్వం, అధికార పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడి కావాలన్నారు. ఓపీనియన్ వెంటనే పంపిస్తే సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు జక్కు శ్రావణ్, లక్క శ్రావణ్‌గౌడ్, ఇంజపల్లి ఓంప్రకాశ్, తిరుమల శ్రీనివాస్, హరీశ్‌యాదవ్, డిష్‌బాబు, సందీప్, సంకేత్, కిరణ్, మోత్కూరి రవికుమార్, కాసు బీరయ్య, వంగ సంతోష్, లెనిన్, నరేశ్, ధనాడ రాజు, పెంటయ్య, అంజయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

## సింగరేణిలో కాళోజీ జయంతి



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న జీఎం రాముడు

**గోదావరిఖని:** కాళోజీ నారాయణరావు జయంతిని మంగళవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అధికారులు లక్కిడి రమేశ్, ఆంజనేయులు, బీమా, హనుమంతరావు, మోహన్‌రావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

**ఆర్జీ–2 ఏరియాలో..**

ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు జయంతి ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఎస్‌వోటూ జీఎం రాముడు అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మురళీకృష్ణ, ధనుంజయ్, రాంచందర్, వేణుగోపాల్, సునీత, సాధన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

**రామగిరి:** ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, ఏరియా సర్వే అధికారి జనార్ధనరెడ్డి, డిప్యూటీ ఎస్టేట్స్ మేనేజర్ కె.ఐలయ్య పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగులకు వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్

**రామగిరి:** ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలోని వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి స్టేడియంలో మంగళవారం సింగరేణి ఉద్యోగులకు ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఏటా వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తోందన్నారు. రీజినల్, కంపెనీ, కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించే పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించి ఏరియా పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య పాల్గొన్నారు.

## మహాధర్నా విజయవంతం చేయండి

**రామగిరి:** సింగరేణి కార్మికుల డిమాండ్ల సాధనకు జీఎం కార్యాలయల ఎదుట 12న నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్‌గౌడ్ కోరారు. బీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25లో వచ్చిన లాభం నుంచి 40శాతం బోనస్‌తో పాటు పలు డిమాండ్లతో ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్రాంచ్ కార్యదర్శి రమేశ్, కార్యదర్శి, పిట్ సెక్రటరీ కృష్ణ, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మహేశ్, సంతోష్, రమేశ్, మహేశ్, లక్ష్మణ్, తిరుపతి పాల్గొన్నారు.

## కంపెనీ క్వార్టర్‌తో కార్మికునికి నష్టమే

**గోదావరిఖని:** కంపెనీ క్వార్టర్ మూలంగా కార్మికునికి నష్టమే జరుగుతుందని సీఐటీయూ ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు మెండె శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని జీడీకే–1, 3వ గనిపై మంగళవారం పోస్టర్ విడుదల చేశారు. కార్మికులు క్వార్టర్‌లో ఉన్నందుకు ఏటా సుమారు రూ.1.50లక్షల నుంచి రూ.1.80లక్షల ఇన్‌కంటాక్స్ రికవరీ చేస్తున్నారన్నారు. ఒక్కో కార్మికుడు రూ.50వేల నుంచి రూ.60వేల వరకు నష్టపోతున్నారన్నారు. సొంతిల్లు నిర్మించుకుంటే ఇన్‌కంటాక్స్ మాఫీతోపాటు రూ.50వేలు కలిసి వస్తాయన్నారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, తోట నరహరిరావు, దాసరి సురేశ్, శశికిరణ్, శ్రావణ్, రాజకుమార్, రమేశ్ పాల్గొన్నారు.

**ఆమె కళ్లు సజీవం**

**ఓదెల:** ఓదెల గ్రామానికి చెందిన ఎంబాడి లక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. మృతుడి కుటుంబసభ్యులు సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ బీష్మాచారికి సమాచారం అందించారు. వెంటనే హైదరాబాద్‌కు చెందిన టెక్నీషియన్ గాజుల సతీశ్ సహకారంతో మంగళవారం కార్నియాలు సేకరించి హైదరాబాద్ ఐబ్యాంకుకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.